నేడు మేడ్చల్‌ మొత్తం కరెంటు కట్‌

మేడ్చల్‌: మేడ్చల్‌ మండలంలోని అన్ని సబ్‌స్టేషన్‌లకు కరెంట్‌ సరఫరా అయ్యే కండ్లకోయ 132/11కేవీ సబ్‌స్టేషన్‌లో ఆదివారం మరమ్మతులు చేస్తున్నందున మండలంలోని అన్ని సబ్‌స్టేషన్‌ల పరిధిలో నేడు కరెంట్‌ సరఫరా ఉండదని ఏఈ రాంబాబు తెలిపారు. శ్రీరంగాపూర్‌, మెడిసిటీ, మేడ్చల్‌, మేడ్చల్‌ టౌన్‌, మేడ్చల్‌ రూరల్‌లోని అన్ని సబ్‌స్టేషన్‌లలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

జడ్పీ హై స్కూల్‌లో ఫుడ్‌ ఫెస్టివల్‌

పోచారం: ప్రతాపసింగారంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో శనివారం పేరెంట్స్‌ మీటింగ్‌ నిర్వహించి, ఫుడ్‌ ఫెస్టివల్‌ ఏర్పాటు చేశారు. వంటలు ఎలా చేయాలో నేర్పించి, ఒక్కో తరగతి విద్యార్థులతో రెండు రకాల వంటలు తయారు చేయించారు. క్యారెట్‌ హల్వా, పాయసం, రవ్వ లడ్డూలు, జొన్న రొట్టెలు, పూరీలు, మిర్చి బజ్జీలు, చికెన్‌ బిర్యానీ, మటన్‌ బిర్యానీ, పలు రకాల పిండి వంటలను రుచికరంగా తయారు చేసి అబ్బురపరిచారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవికుమార్‌, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నియామక పత్రం అందజేత

ఘట్‌కేసర్‌: జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా ఘట్‌కేసర్‌ మున్సిపాలిటీకి చెందిన మేడబోయిన సంజీవముదిరాజ్‌ ఎంపికయ్యారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపు బాల్‌రాజ్‌యాదవ్‌ ఎంపిక చేయగా.. ఆ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య ఆయనకు శనివారం నియామక ప్రతం అందజేశారు.

బహుమతుల ప్రదానం



మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ఇటీవల నిర్వహించిన సీఎం కప్‌ క్రికెట్‌ టోర్నీ విజేతలకు శనివారం మున్సిపాల్‌ చైర్‌పర్సన్‌ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. టోర్నీ విజేతగా 13వ వార్డు నిలవగా, రన్నర్‌గా నిలిచిన 1వ వార్డు జట్లకు చైర్‌పర్సన్‌, మున్సిపల్‌ కమిషనర్‌ స్వామి, వైస్‌ చైర్మన్‌ ప్రభాకర్‌, 13వ వార్డు కౌన్సిలర్‌ మల్లికార్జున్‌ ముదిరాజ్‌, మేనేజర్‌ శ్రీనివాస్‌గౌడ్‌, కౌన్సిలర్లు, అధికారులు బహుమతులు అందజేశారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

మేడ్చల్‌: పట్టణంలోని 9వ వార్డులో మున్సిపల్‌ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ దీపికనర్సింహారెడ్డి ప్రారంభించారు. 9వ వార్డు గిర్మాపూర్‌లో రూ. 20.50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్‌ లావణ్య హన్మంత్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపల్‌ సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్‌ సమావేశంలో.. మున్సిపల్‌ పరిధిలో రూ.1.30 కోట్ల నిధులతో వీధి దీపాలు, మంచినీటి బోర్ల మరమ్మతులు, డ్రైనేజీ మరమ్మతులు తదితర పనులకు తీర్మానం చేసి ఆమోదించారు. సమావేశంలో కమిషనర్‌ స్వామి, వైస్‌ చైర్మన్‌ ప్రభాకర్‌, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

అభినందనలు

ఘట్‌కేసర్‌: రంగారెడ్డి జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లాక్‌ స్థాయి వాలీబాల్‌ టోర్నీలో ఘనాపూర్‌ కొమ్మూరి ప్రతాపరెడ్డి ఇంజనీరింగ్‌ కళాశాల (కేపీఆర్‌ఐటీ) క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా కేపీఆర్‌ఐటీ చైర్మన్‌ కొమ్మూరి ప్రతాపరెడ్డి, వైస్‌ చైర్మన్‌ కొమ్మూరి ప్రశాంత్‌ రెడ్డి, డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ సుధీర్‌ ప్రేమ్‌కుమార్‌, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ రవీంద్ర, క్రీడల సమన్వయకర్త మదన్‌ శనివారం క్రీడాకారులను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విజేతల కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫిజికల్‌ డైరెక్టర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

రోబోకలం-హైదరాబాద్‌తో ఎమ్మార్‌ఈసీడబ్ల్యూ ఒప్పందం

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజనీరింగ్‌ కాలేజ్‌ ఫర్‌ ఉమెన్‌ (ఎమ్మార్‌ఈసీడబ్ల్యూ) రోబోకలం-హైదరాబాద్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. శనివారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్‌ మాధవిలత-రోబోకలం డైరెక్టర్‌ మహ్మద్‌ సాజీద్‌ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మందకొడిగా ‘ఇందిరమ్మ ఇళ్ల’ సర్వే

- వచ్చిన దరఖాస్తులు 1.46 లక్షలు
- 31 శాతం మాత్రమే సర్వే పూర్తి
- సిబ్బంది కొరతతో ఆపసోపాలు పడుతున్న గృహనిర్మాణ శాఖ
- సర్వే సిబ్బంది కోసం పలు శాఖలకు ఆదేశాలు జారీ చేసిన అదనపు కలెక్టర్



సాక్షి, సిటీబ్యూరో: ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ పథకం ద్వారా ఇల్లు అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సర్వేను ప్రారంభించింది. సిబ్బంది కొరతతో ఆ సర్వే మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలో మందకొడిగా సాగుతోంది. జిల్లాలోని 13 పురపాలక సంఘాలు, 34 గ్రామ పంచాయతీల పరిధిలో 1.46 దరఖాస్తులు రాగా..ఇప్పటి వరకు కేవలం 31 శాతం మాత్రమే పూర్తయ్యాయి.పెద్ద గ్రామ పంచాయతీలతో పాటు పురపాలక సంఘాల్లో మందకొడిగా సర్వే జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా అందిన 1.46 లక్షల దరఖాస్తులను పరిశీలించి ఇందిరమ్మ ఇల్లు యాప్‌లో అప్‌లోడ్‌ చేయడానికి 34 గ్రామ పంచాయతీలలో 34 మంది, 13 పురపాలక సంఘాల పరిధిలోని 285 వార్డుల వారీగా 285 మంది సర్వేయర్లను నియమించారు.

31న ముగుస్తున్న గడువు

ఈ నెల 9 నుంచి సర్వే ప్రారంభమైనా... ఇప్పటి వరకు 31 శాతం మాత్రమే పూర్తయ్యింది. ఈనెల 31వ తేదీ వరకు పూర్తి చేయాల్సి ఉంది. దరఖాస్తుదారుడు అందుబాటులో ఉండి, అవసరమైన పత్రాలు అందిస్తే పది నిమిషాల్లో ప్రక్రియను పూర్తి చేయవచ్చని, పలు గ్రామాల్లో ఫోన్‌ సిగ్నల్స్‌ సమస్యతో ఆలస్యమవుతోందని సర్వేయర్లు చెబుతున్నారు.

గత లబ్ధిదారులపై ఆరా..

గత కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి పొందారా? అనే విషయం సర్వే యాప్‌తో తెలిసిపోతున్నట్లు తెలుస్తోంది. దరఖాస్తుదారులు ప్రస్తుతం ఉంటున్న ఇంటి స్వరూపం ఎలా ఉంది, గదులు, కుటుంబ సభ్యుల వివరాలు తదితర వివరాలు సేకరిస్తున్నారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన స్థలం ఉందా? ఉంటే వాటికి సంబంధించిన పత్రాలు, లేకపోతే ఇంటిపన్ను రసీదు, కరెంటు బిల్లు, సాదాబైనామా పత్రం స్కానింగ్‌ చేస్తున్నారు. దరఖాస్తుదారుడి ఫొటోతో పాటు ఇంటి స్వరూపానికి సంబంధించిన మూడు ఫొటోలు తీస్తున్నారు. తల్లిదండ్రులతో పాటు కుమారులు పెళ్లి చేసుకుని ఒకే ఇంట్లో వేర్వేరుగా నివాసముంటున్న వారు ముందే దరఖాస్తు చేసుకుని ఉంటే వారికి అదే స్థలంలో వేర్వేరుగా సర్వే చేస్తున్నారు.

హకీంపేటలో రాష్ట్రపతికి ఘన వీడ్కోలు



సాక్షి,సిటీబ్యూరో: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నగరంలో శీతాకాలం పర్యటన విజయవంతంగా ముగించుకుని శనివారం హకీంపేట విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా హకీంపేట విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ గౌతమ్‌, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. రాష్ట్రపతి శీతాకాలం విడిది కోసం మంగళవారం హైదరాబాద్‌కు వచ్చిన విషయం తెల్సిందే. ఆరు రోజుల పర్యటన అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఢిల్లీకి వెళ్లారు.


యువత డ్రగ్స్‌ బారిన పడొద్దు



పోస్టర్‌ విడుదల చేస్తున్న పోలీసులు, విద్యార్థులు

మేడ్చల్‌రూరల్‌: యువత డ్రగ్స్‌ బారిన పడి మత్తుకు బానిసలుగా మారవద్దని రాష్ట్ర యాంటీ నార్కోటిక్‌ బ్యూరో ఎస్పీ సాయిచైతన్య అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్‌ పీటర్స్‌ ఇంజనీరింగ్‌ కళాశాలలో శనివారం డ్రగ్స్‌ నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్‌ వినియోగం వల్ల కలిగే అనర్థాలను, వాటి సరఫరాకు పాల్పడితే పడే శిక్షలపై అవగాహన కల్పించారు. అనంతరం వాల్‌పోస్టర్‌ విడుదల చేసి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో యాంటీ నార్కోటిక్‌ బ్యూరో సభ్యులు డీసీపీ హరీష్‌చంద్రారెడ్డి, ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌రావు, కళాశాల పీఆర్వో రవిసుధాకర్‌, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



మమత (ఫైల్‌)

జవహర్‌నగర్‌: మహిళ అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్‌లో నివసించే భరత్‌, భార్య మమత (45) కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. మమతకు మతిస్థిమితం బాగా లేదు. ఈ నెల 20న మమత ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. మమత ఆచూకీ కోసం తెలిసిన చోట వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రపతి పర్యటన విజయవంతంపై అభినందనలు



సాక్షి,సిటీబ్యూరో: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన విజయవంతం చేయడంలో జిల్లా స్థాయిలోని అన్ని శాఖల అధికారుల పాత్ర ఎంతో అభినందనీయమని, ఎంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించారని మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ ప్రశంసించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది శనివారంతో ముగియడంతో ఆమె ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్‌ గౌతమ్‌ మాట్లాడుతూ.. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 17న హకీంపేట విమానాశ్రయానికి చేరుకున్నప్పటి నుంచి ఐదు రోజుల పాటు తిరిగి వెళ్ళేంత వరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించటం పట్ల అభినందనలు తెలిపారు. ఆయా శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నేరవేర్చారన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది, రెవెన్యూ శాఖ, రహదారులు, విద్యుత్‌, అటవీ, వైద్య ఆరోగ్యం, సివిల్‌ సప్లయి, అగ్నిమాపక శాఖలతో పాటు అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పని చేయడం వల్లనే రాష్ట్రపతి పర్యటన విజయవంతంగా ముగిసిందన్నారు.

కోర్టు భవనాలకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్‌ అభినంద్‌కుమార్‌

మేడ్చల్‌: మేడ్చల్‌లోని కోర్టులన్నీ ఓకె సముదాయంలో ఉండటానికి కృషి చేస్తున్నట్లు జిల్లా అడ్మినిస్ట్రేటివ్‌ జడ్జి, హైకోర్టు జడ్జి జస్టిస్‌ అభినంద్‌కుమార్‌ అన్నారు. మేడ్చల్‌ న్యాయస్థానం ఆవరణలో రూ. 90 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న కోర్టు భవనాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయం కోసం కోర్టులకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా న్యాయస్థానాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. అన్ని రకాల కోర్టులు ఓకె ఆవరణలో ఉండటం వల్ల అందరికి సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. కోర్టు భవనాల నిర్మాణం పూర్తయితే మేడ్చల్‌లోని అన్ని కోర్టులు ఒకే ప్రాంగణంలో ఉంటాయన్నారు. సమావేశంలో జిల్లా కోర్టు న్యాయాధికారి బాలభాస్కర్‌ రావు, రెండవ జిల్లా అడిషనల్‌ కోర్టు న్యాయాధికారి జీవన్‌కుమార్‌, న్యాయమూర్తులు అజయ్‌కుమార్‌, లావణ్య, దీలీప్‌కుమార్‌, హేమలత, అదనపు కలెక్టర్‌ విజయేందర్‌రెడ్డి, బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, న్యాయవాదులు, అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం



లిటిల్‌లిల్లి పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన



నాగారం సెరినిటీ పాఠశాలలో.. జాతీయ గణిత దినోత్సవంలో కరస్పాండెట్‌, విద్యార్థులు

మేడ్చల్‌: శ్రీనివాస్‌ రామానుజ జయంతి సందర్భంగా పట్టణంలోని వివిధ పాఠశాలల్లో గణిత దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో పాఠశాలల్లో విద్యార్థులు వివిధ ప్రదర్శనలు, క్విజ్‌లు నిర్వహించారు. అత్వెల్లిలో హైస్కూల్‌లో, మేడ్చల్‌లోని లిటిల్‌లిల్లి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలల్లో సాంస్కృతిక ప్రదర్శనలను విద్యార్థులు నిర్వహించారు.

కీసరలో..

రాంపల్లి జూబ్లిహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌ అన్నారు. శనివారం ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజం, జన్మదినాన్ని పురస్కరించుకొని రాంపల్లి జూబ్లీ హిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌లో నిర్వహించిన గణిత దినోత్సవ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ పద్మజరావు పాల్గొన్నారు. విద్యార్థులకు గణితం యొక్క ప్రాధాన్యతను తెలియజేశారు. విద్యార్థులకు క్విజ్‌ పోటీలతోపాటు, రూబిక్స్‌ క్యూబ్‌ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



రాంపల్లి జూబ్లీహిల్స్‌ పబ్లిక్‌ స్కూల్‌లో గణిత దినోత్సవ కార్యక్రమంలో విద్యార్థులు



కీసరలో.. గణిత నమూనాలను పరిశీలిస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ చంద్రారెడ్డి తదితరులు

సుప్రభాత్‌ టౌన్‌షిప్‌లో వసతుల కోసం వినతి



చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సుప్రభాత్‌ టౌన్‌షిప్‌ ప్రతినిధులు

పోచారం: కొర్రెముల్‌లోని సుప్రభాత్‌ టౌన్‌షిప్‌ను చైర్మన్‌ కొండల్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు కావాల్సిన వసతులు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర సీనియర్‌ సిటిజన్స్‌ అసోసియేషన్‌ కొర్రెముల్‌ యూనిట్‌ ప్రతినిధులు చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. నీటి సరఫరా, డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ మూతలు, గ్రంథాలయం, ఓపెన్‌ జిమ్‌ ఏర్పాటు, కుక్కల బెడద నివారణ చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. నారపల్లి బస్‌స్టాప్‌ వద్ద జీబ్రా లైన్స్‌, పాదచారుల వంతెన నిర్మించి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని కోరారు. అందుకు చైర్మన్‌ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ అధ్యక్షుడు బంగారి రాజయ్య, ప్రధాన కార్యదర్శి వేణు మాధవ్‌, కాలనీ ప్రతినిధులు శనీశ్వర బహదూర్‌, మన్యం, సురేందర్‌రెడ్డి, రాజనర్సు, మల్లయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌ చెరువు కట్టకు మోక్షం

- రోడ్డు నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు



గుంతలమయంగా మేడ్చల్‌ పెద్ద చెరువు కట్ట రోడ్డు

మేడ్చల్‌: ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని మేడ్చల్‌ పెద్ద చెరువు కట్ట ఎట్టకేలకు అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. శుక్రవారం జరిగిన మున్సిపల్‌ కౌన్సిల్‌ సమావేశంలో చెరువు కట్టపై సీసీ రోడ్డు నిర్మాణంకు రూ.50 లక్షలు కేటాయిస్తూ తీర్మానం చేసింది. మేడ్చల్‌ మీదుగా వెళ్లే 44వ జాతీయ రహదారి విస్తరణ పనులు, ఫ్లై ఓవర్‌ బ్రిడ్జిల నిర్మాణ పనులు సాగుతుండటంతో ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే నిత్యం నరకం చూడాల్సి వస్తోంది. పట్టణ ప్రజలు రెండు కిలో మీటర్ల ప్రయాణంకు గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కోవాల్సి వస్తోంది. వివేకానంద విగ్రహం నుంచి కట్టమీదుగా చెక్‌ పోస్ట్‌ వరకు పాత జాతీయ రహదారి ఉండగా దానిని ప్రత్యామ్నయ రోడ్డుగా మార్చాలని ఎంతమంది మొరపెట్టుకున్నా ఎవ్వరూ పట్టించుకోలేదు. దీంతో రహదారి ట్రాఫిక్‌, పట్టణ ట్రాఫిక్‌తో జాతీయ రహదారి పై నిత్యం పట్టణం పొడవునా ట్రాఫిక్‌ జామ్‌ అవుతుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రత్యామ్నయంగా ఉన్న పాత రోడ్డు మీద వెళదామంటే చెరువు కట్ట పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో పాత రహదారి ఉన్న చెరువు కట్టను పెద్దగా వినియోగించడం లేదు. తాజాగా మున్సిపల్‌ కౌన్సిల్‌ కట్టకు రూ.50 లక్షలు కేటాయించడంతో మేడ్చల్‌ పట్టణ వాసులకు నగరం వైపు వెళ్లడానికి ప్రత్యామ్నయ మార్గం తయారైనట్టే. చెరువు కట్టపై రోడ్డు నిర్మించి అభివృద్ధి చేస్తే మేడ్చల్‌ వాసుల జాతీయ రహదారి ట్రాఫిక్‌ కష్టాలు తీరినట్టే.

‘సాక్షి’ చెబుతూనే ఉంది..

మేడ్చల్‌ వాసుల ట్రాఫిక్‌ కష్టాలు తీరాలంటే పెద్ద చెరువు కట్టపై కింది బస్తీ నుంచి చెక్‌పోస్ట్‌ వరకు సీసీ లేదా బీటీ రోడ్డు నిర్మించాలని గత సంవత్సర కాలంగా ‘సాక్షి’ దినపత్రిక కథనాల ద్వారా సమస్యను వివరిస్తూ పరిష్కారం చూపాలనే ప్రయత్నాలు చేసింది. ‘సాక్షి’ కృషితో రోడ్డుకు రూ. 50లక్షలు మంజూరు కావడంతో పాఠకులు, పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కౌన్సిలర్‌ మణికంఠగౌడ్‌ రూ.50 లక్షలు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దీంతో పాటు పట్టణంలో తుమ్మ చెరువు నీరు కలుషితం కాకుండా అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ నిర్మాణం, మార్కెట్‌ రోడ్డు వెడల్పు వంటి పనులు జరుగుతుండటంతో కౌన్సిల్‌ పదవి కాలం చివరి దశలో పనులు జోరుగా సాగుతున్నాయి. ప్రతీ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. మున్సిపల్‌ కౌన్సిల్‌ ముగింపు దశలో పనులు మాత్రం జోరుగా ఉన్నాయి.

రోడ్డు విస్తరణ కోసం కూల్చివేతలు



ఘట్‌కేసర్‌: పట్టణంలో నిర్మిస్తున్న రైలు వంతెన కోసం శనివారం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా భూసేకరణను చేపట్టారు. భూసేకరణ అధికారి భాస్కర్‌రెడ్డి, స్థానిక తహసీల్దార్‌ రజని, నాయబ్‌ తహసీల్దార్‌ రాజేందర్‌ ఆధ్వర్యంలో శనివారం కూల్చివేతలు చేపట్టారు. 88 దుకాణాలను కూల్చివేశామని, 12 దుకాణాలపై కోర్టులో కేసులు ఉన్నందున వదిలి వేశామని రెవెన్యూ అధికారులు తెలిపారు. భూమిని కోల్పోయిన వారి నష్టపరిహారం 2015 కోర్టులో జమాచేయడం జరిగిందని, నష్టపరిహారం తీసుకోవాలని వారికి సూచించారు. కాగ కూల్చివేతల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఘట్‌కేసర్‌ ఇన్‌స్పెక్టర్‌ పరశురాం, పోచారం ఇన్‌స్పెక్టర్‌ రాజువర్మ గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు. కాగ భూసేకరణ కూల్చివేతలు ప్రశాంతంగా జరగడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు.

అండర్‌పాస్‌ పూర్తయితే డంపింగ్‌ యార్డు తరలింపు



మేడ్చల్‌లో డంపింగ్‌ యార్డు



మేడ్చల్‌ మున్సిపల్‌ కార్యాలయం

మేడ్చల్‌: మేడ్చల్‌ పట్టణం రోజురోజుకు విస్తరిస్తుండటం, శివారు ప్రాంతాలలో కాలనీలు వెలియడం, డంపింగ్‌ యార్డుల నిర్వహణ అధికం కావడంతో నగరానికి చెత్త అడ్డాగా ఉన్న నియోజకవర్గంలోని జహర్‌నగర్‌ డంపింగ్‌ యార్డుకు మేడ్చల్‌ మున్సిపాలిటీ చెత్తను తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మేడ్చల్‌ పట్టణంలో అండర్‌పాస్‌ రైల్వే బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే టౌన్‌ చెత్తను జవహర్‌నగర్‌కు తరలించడానికి అన్ని సిద్ధం చేస్తున్నారు. మేడ్చల్‌ పట్టణంలోని నిత్యం టన్నుల కొద్ది చెత్తను మున్సిపల్‌ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సేకరిస్తున్నారు. అత్వెల్లి పరిధిలోని జయదర్శిణి సమీపంలో గల ప్రభుత్వ భూములలో డంపింగ్‌ ఏర్పాటు చేసి వేస్తున్నారు. రైల్వే స్టేషన్‌ అవతల ప్రాంతంలో మరో డంపింగ్‌ యార్డు ఏర్పాటు చేసి అక్కడ చెత్త వేస్తున్నారు. ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా చెత్తను సేకరిస్తూ డంపింగ్‌ యార్డులకు తరలిస్తున్నారు. పదుల సంఖ్యలో ఆటోలు, ట్రాక్టర్లు పెట్టి చెత్తను సేకరిస్తున్నారు. రైల్వే గేట్‌ వద్ద ఆర్‌యూబీ నిర్మిస్తుండటంతో పట్టణం నుంచి వాహనాలు అక్కడ ఏర్పాటు చేసిన డంపింగ్‌ యార్డుకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. దీంతో గత మూడు నాలుగేళ్లుగా అత్వెల్లి డంపింగ్‌ యార్డు పై ఒత్తిడి పెరిగింది. అక్కడ చెత్తను శుభ్రం చేసి రీసైక్లింగ్‌ చేసే సిస్టం లేకపోవడంతో చెత్తను తగులబెడుతున్నారు. మరో వైపు రైల్వేస్టేషన్‌ సమీపంలో డంపింగ్‌ యార్డు ఉండటంతో సమీపంలో 10 కాలనీలు ఉండటంతో వారికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రైల్వే స్టేషన్‌ వద్ద ఉన్న డంపింగ్‌ యార్డులో ఆధునికంగా ఉండి అన్ని వసతులు ఉన్నా.. వాహనాలు అక్కడకు వెళ్లే వీలులేకుండా పోవడంతో రైల్వే ట్రాక్‌ అవతలి వైపు ఉన్న కాలనీల చెత్త మాత్రమే అక్కడకు వెళ్తోంది.

అధికారులు గ్రీన్‌ సిగ్నల్‌..

మేడ్చల్‌ నుంచి వెలువడే చెత్త మొత్తం మేడ్చల్‌లో కాకుండా సమీపంలో ఉన్న జవహర్‌నగర్‌ డంపింగ్‌ యార్డుకు తరలించాలని జిల్లా అధికారులు 6 నెలల క్రితం ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులు సైతం అనుమతులు ఇచ్చారు.

అడ్డంగా ఆర్‌యూబీ..

మేడ్చల్‌ రైల్వే కాలనీ సమీపంలో ప్రధాన డంప్‌ యార్డు ఉంది. రైల్వే ఆర్‌యూబీ పనులు జరుగుతుండడంతో ఆర్‌యూబీ గుండా వాహనాలు వెళ్లే స్థితి లేకపోవడంతో అత్వెల్లి వద్ద తాత్కాలిక యార్డు ఏర్పాటు చేశారు. చెత్తతో పట్టణ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు ఉండటంతో జిల్లా అధికారులు చెత్తను జవహర్‌నగర్‌కు తరలించాలని ఆదేశించారు. మేడ్చల్‌ నుంచి వెలువడే చెత్తను ఒకే దగ్గర వేసి అక్కడి నుంచి వాహనాల్లో తీసుకెళ్లేందుకు ఆర్‌యూబీ నిర్మాణం అడ్డంగా మారడంతో ఆర్‌యూబీ నిర్మాణం పూర్తయితే చెత్త తరలింపు సులువవుతుంది.

అండర్‌పాస్‌ బ్రిడ్జి పూర్తయితే..



మేడ్చల్‌ నుంచి వచ్చే చెత్తను పూర్తిగా జవహర్‌నగర్‌ డంపింగ్‌ యార్డుకు త్వరలోనే తరలిస్తాం. జీహెచ్‌ఎంసీ నుండి, జిల్లా అధికారుల నుంచి అనుమతులు పొందాము. మినీ డంపింగ్‌ యార్డు ఏర్పాటు చేసి అక్కడి నుంచి టిప్పర్ల ద్వారా లోడ్‌ చేసి యార్డుకు తరలించాలని ప్రయత్నాలు చేసిన స్థలం కొరత వల్ల సాధ్యం కాలేదు. మేడ్చల్‌ రైల్వే కాలనీ సమీపంలో ఉన్న డంపింగ్‌ యార్డు నుంచి చెత్తను తరించడానికి అన్ని ఏర్పాట్లు ఉన్నా వాహనాలు వచ్చే పరిస్థితి లేనందున సాధ్యపడలేదు. అండర్‌పాస్‌ బ్రిడ్జి నిర్మాణం పూర్తయిన వెంటనే మేడ్చల్‌లో డంపింగ్‌ యార్డులు లేకుండా చెత్తను తరలిస్తాం.

– నాగిరెడ్డి, మేడ్చల్‌ మున్సిపల్‌ కమిషనర్‌